# ఫికర్

"ఠాంగ్! ఠాంగ్! ఠాంగ్!!!" గోడ గడియారం పన్నెండు కొట్టింది.

చేతి గడియారం 1వ తారీఖు చూపించింది.

టెలివిజన్ "హ్యాపీ న్యూ యియర్" చెప్పింది.

"చీర్స్" అన్నారు జంట్స్ అంతా హాట్ డ్రింక్స్ పైకెత్తి అరుస్తూ.

"ప్యాంట్స్" అన్నారు లేడీస్ అంతా కూల్‌డ్రింక్స్ అంత పైకెత్త కుండా నవ్వుతూ.

గంట గడిచింది. సోగ్గాళ్ళ దగ్గర సోడా బాటిల్ ఒకటి పెటీల్ మంది. ఆడాళ్ళ దగ్గర గుండెలు గుభేల్ మన్నాయి.

మరో అరగంట గడిచిం తర్వాత "ఆ సోడా బాటిల్ నీ చెయ్యి తగిలే పగిలింది. నా కొడ..."

"కాదు. నీ చెయ్యి తగిలే పగిలింది నా కొడ..."

"మాటలు మిగిలితే తల పగులుతుంది నీ..."

"... ... ... ..."

సముద్రపుటలల్లా గోలగా పెరుగుతున్న మగవాళ్ళ డైలాగుల హేలకి అబలలలో అలజడి పెరిగింది. ఒక్కొక్కరూ ఫోర్కులూ, నైపులూ, చెంచాలూ జాగ్రత్తగా దాచెయ్యసాగారు.

ఆ తర్వాత పది నిముషాలలో వాష్ బేసిన్ వారగా వాష్ ఔట్ అయిపోయాడు వామనరావు. అదంతా వాష్ చెయ్యలేక ఔట్ అయిపోయిన అతని వామాంగి, 'తెల్లారనీ! ఈ చీపురుతోనే నీ పని చెప్తా!' అనుకుంది.

* *

"ఇంకెప్పుడూ అలా తాగను. సారీ!" అన్నాడు అంట్లు తోముతున్న ఆచారి వాంచారితో.

"మేం కూడా మీతో పాటు తాగితే ఏమయ్యేది?" అని అడిగిన మజాలీతో, "ఏముంది. ఇంకా మజా పెరిగేది!" అన్నాడు రజాక్. "ఔను. ఎవరి పెళ్ళాం లెవరో, ఎవరి మొగుళ్ళెవరో తెలిసేది కాదు. నిజంగానే మజా పెరిగేది. ఛీ..ఛీ..!" అని లోపలికి వెళ్ళిపోయిన భార్య వైపు చూస్తూ ఆలోచనలో పడ్డాడు రజాక్!

"స్టీఫ్! ఈసారి కనక నువు యిలా చెడ తాగితే ఐ విల్ గివ్ యూ పాయిజన్ ఎండ్ కిల్ యూ! టేక్ కేర్" అని బెదిరిస్తూ సోఫియా ఇచ్చిన కాఫీ కేసి భయంభయంగా చూస్తూ, కాఫీ తాగకుండానే ఆఫీస్ కెళ్ళిపోయాడు స్టీఫెన్.


* * *

మళ్ళీ ఏడాదికి అల్లాంటి ఫస్టే వచ్చిన ఓ రోజున ఆఫీసులో — "సారీ గురూ! ఈసారికి నేను పార్టీకి రాలేను" అన్నాడు వామనరావు.

"ఏం? మీ ఆవిడ తిడుతుందా? చీపురు తిరగేస్తుందా?" వెకిలిగా అడిగాడు సీనియర్ వీడోయర్ సూడోరావ్.

"ఏమైనా అనుకో! యూ ఆర్ ఎట్ లిబర్టీ!" అన్నాడు వామనరావు. "ఐ యామ్ ఎట్ ప్యారడైజ్!"

"అఫ్‌కోర్స్! మీ ఇల్లు ప్యారడైజ్ దగ్గరే కావచ్చు. కాని మందు కొట్టిం తర్వాత మాత్రం ప్యారడైజ్ లాస్టే! సారీ! నే పోతున్నాను"



ఏదో మోటు జోకు వేసి నవ్వుతున్న సూడోరావుతో, "వస్తాను గురూ! నాకు కొంచెం పనుంది" అంటూ లేచాడు ఆచారి.

"అదేమిటి! నువ్వూ వామనరావు గాడి కేసేనేమిటి?" వీడోయర్.

"అది కాదులే! చెప్పాను గదా, కొంచెం పనుందని" అని బయల్దేరాడు ఆచారి.

"నే పోతా గురూ! ఇవాళ శుక్రవారం! నేను మందు కొట్టను గదా!" అన్నాడు రజాక్!

"అదెప్పటి నుంచి?" ఆశ్చర్యపోతూ అడిగాడు సూడోయర్.

"ఈ మధ్య నుంచే" అంటూ బయటికెళ్ళిపోయాడు రజాక్.

"బై ది బై! ఇవాళ మా మామగారొచ్చారు. నేనూ వెళ్ళాలి" అన్నాడు స్టీఫెన్ లేస్తూ.


"నువ్వు కూడా వెళ్ళిపోతే ఎట్లా గురూ!" అన్నాడు మతిపోయిన వీడోరావ్.

"అల్లా కాదులే! చెప్పాను గదా మా మామగారొచ్చారని. ఇంకోసారెప్పుడైనా కూర్చుందాంలే!" అని చెప్పి దారిలో ఓ క్వార్టర్ కొనుక్కుని ఇంటి కెళ్ళిపోయాడు స్టీఫెన్.

తల తిరిగిన సూడో వీడోయర్ ఒక్కడే కూర్చుని మందుకొడుతూ, "వీళ్ళెక్కడి క్యారెక్టర్స్‌రా బాబూ!" అనుకున్నాడు.

యస్! ఎవ్రీ హజ్బెండ్ ఈజ్ ఎ క్యారెక్టర్! కాని వాడి లోపల ఫికర్ వుండే — దటీజ్ ది మిస్సింగ్ ఫ్యాక్టర్! అది క్రియేట్ చెయ్యగలిగితే వైఫ్ ఈజ్ ఎ గుడ్ డైరెక్టర్! కాదంటారా?

—విశ్వనాథ పావనిశాస్త్రి




కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్